క్లుప్తంగా

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఓజిలి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో వి.బాలకృష్ణనాయక్ ఆదేశించారు. ఆయన శనివారం ఓజిలి పీహెచ్‌సీను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఓపీ సంఖ్యను పెంచి మందులు అందజేయాలని సూచించారు. పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్యను పెంచాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యసిబ్బంది శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసరావు, వైద్యులు డానియల్‌రాజు, హిమజ పాల్గొన్నారు.

నేడు సైదాపురంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని పంచాయతీ కార్యాలయంలో ఆదివారం నెల్లూరులోని సుశీల నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు ఉప సర్పంచ్ బొలిగర్ల శివకుమార్ తెలిపారు. వైద్యులు అన్ని పరీక్షలు చేస్తారని, అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

పెళ్లకూరు: రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె శనివారం పెళ్లకూరులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన అదనపు హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో బాలకృష్ణ నాయక్, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, డాక్టర్ సుజాత, తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రమీలారాణి పాల్గొన్నారు.

అధ్యాపకునికి డాక్టరేట్



అధ్యాపకుడిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ సీఎస్‌ఈ విభాగంలో పనిచేస్తున్న అధ్యాపకుడు వి.భువనకుమార్‌కు చెన్నైకి చెందిన హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన ప్రొఫెసర్ కధివరన్ ఆధ్వర్యంలో ఏసీవోఏ-ఎల్ఎస్‌టీఎం, రెసిడ్యువల్ జీఆర్‌యూ ఆధారంగా ఎంబీడీఐ మ్యూజిక్ ఆపరేషన్, గుర్తింపును ఆప్టిమైజ్ చేయడం అనే అంశం మీద పరిశోధన చేశారు. డాక్టరేట్ పొందిన భువనకుమార్‌ను కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, హెచ్‌వోడీ రాజశేఖర్‌రెడ్డి అభినందించారు.

రక్త దానంతో ప్రాణదానం

గూడూరు రూరల్: రక్త దానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని గూడూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, ప్రముఖ వైద్యులు రోహిణి పిలుపునిచ్చారు. రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రక్త దానంపై అవగాహన కల్పించేలా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రక్త దానం చేయడం వల్ల తమలోని శక్తి నశించి పోతుందనే అపోహలు ఉన్నాయని, వాటిని పక్కన పెట్టి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు.

వేటాడేద్దాం

- నేటి అర్ధరాత్రి నుంచి సముద్రంలోకి
- 61 రోజుల తర్వాత తీరంలో మత్స్యకారుల సందడి
- ముగిసిన చేపల వేట నిషేధిత గడువు



బోటును సముద్రంలో తోసేందుకు సిద్ధంగా మత్స్యకారులు



తూపిలిపాళెం వద్ద వలలను ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు

రాష్ట్ర మత్స్యశాఖ విధించిన చేపల వేట నిషేధం శనివారం అర్ధరాత్రితో ముగిసిపోయింది. 61 రోజుల వేట విరామం తర్వాత ఆదివారం తెల్లవారుజామున సముద్రంలో చేపల వేట పునఃప్రారంభమవుతోంది. సముద్రతీరం మళ్లీ కళకళలాడనుంది. దీంతో తిరుపతి జిల్లాలోని మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లేందుకు సామగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో ఇన్నాళ్లు బోసిపోయిన సముద్ర తీరం మళ్లీ సందడిగా మారనుంది.

వాకాడు: వాకాడు సమీపంలోని తూపిలిపాళెం సముద్రం తీరం వద్ద మత్స్యకారులు వేటకు బయలుదేరే ముందు ఒకరినొకరు పలకరించుకోవడం, ఒడ్డున కూర్చుని మత్స్య సంపద దొరికే ప్రదేశాలపై చర్చించుకోవడం, ఇష్టదైవం గంగమ్మను ప్రార్థించుకోవడం, కుటుంబ సభ్యుల నుంచి ఆశీస్సులు తీసుకోవడం కనిపించింది. ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు చేపల పునరుత్పత్తి సమయం కావడంతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏటా వేట నిషేధం అమలు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర మత్స్యశాఖ ఆదేశాలకు కట్టుబడి రెండు నెలలుగా వేట లేక ఖాళీగా ఉన్న మత్స్యకారులు ఆకలితో అలమటించారు. రెండు నెలల వేట నిషేధం తరువాత మత్స్యకార గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం వేకువ జాము నుంచి మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు బయలు దేరుతున్నారు.

తీరం వెంట 25 మత్స్యకార గ్రామాలు

జిల్లాలో సముద్రం తీరం వెంట చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ, మండలాలు ఉన్నాయి. 79 కిలోమీటర్లు మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. తీరం వెంబడి 25 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. అందులో 4.5 వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. 6500 మంది మత్స్యకారులు చేపల వేటనే ఆధారంగా చేసుకుని బతుకుతున్నారు. వీరికి 834 బోట్లు ఉన్నాయి. ఏడాదిలో 10 నెలల వేట ద్వారా 22 వేల టన్నుల మత్స్య సంపదను మత్స్యకారులు సేకరిస్తున్నారు.

వైఎస్సార్ హయాంలో మత్స్యకార భరోసా

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి మత్స్యకారుడికి ఏటా వారి ఖాతాలో రూ.10 వేలు జమ చేయడం జరిగింది. అలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాటు ఏటా రూ.10 వేలు మత్స్యకార భరోసాతో ఆదుకుంది. వేట నిషేధం ప్రకటించిన రోజునే ఆ పరిహారాన్ని వారి బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేయడం జరిగేది.

కూటమి ప్రభుత్వం గత ఏడాది ఎగనామం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2024 జూన్‌లో అందాల్సిన వేట విరామం భృతి ఎగ్గొట్టారు. ఆ సమయంలో అధికారులు హడావుడి చేసి చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్ళూరుపేట, తడ, మండలాల్లో 2024–25 భృతి కింద 3700 మంది మత్స్యకారులను అర్హులుగా గుర్తించారే తప్ప వీరికి ఆ ఏడాది వారికి అందాల్సిన భృతి అందలేదు. రూ.10 వేల పరిహారాన్ని రూ.20 వేలకు పెంచామని కూటమి పెద్దలు గొప్పలు చెప్పారు. కాని గత ఏడాది ఎగ్గొట్టి ఈ ఏడాది మాత్రమే ఇవ్వడం వలన కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ. 10వేలు మాత్రమే ఇచ్చినట్లయ్యింది. రెండేళ్లకు కలిపి ఒక్కో మత్స్యకారుడికి రూ.40 వేలు చొప్పున 3700 మందికి రూ.14.80 కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.7.50 కోట్లు మాత్రమే జమ చేసింది.



బోట్లను సిద్ధం చేస్తున్న మత్స్యకారులు



చేపలు దొరికే ప్రదేశాలపై మత్స్యకారుల సమీక్ష

జాగ్రత్తలు పాటించాలి



61 రోజుల తరువాత వేటకు బయలుదేరుతున్న మత్స్యకారులు జాగ్రత్తలు పాటించాలి. ప్రతి ఒక్కరూ మంజూరు చేసిన గుర్తింపు కార్డులు వేటలో వెంట తీసుకెళ్లాలి. అలాగే కొత్తగా బోట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు పత్రాలు వెంట తీసుకుపోవాలి. సముద్రంపై ఎవ్వరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఎదురైన వెంటనే తమకు తెలియజేయాలి. మెరైన్ పోలీసులకు అందరూ సహకరించాలి.

– రాజేష్, జిల్లా ఇన్‌చార్జి మత్స్యశాఖ అధికారి, కోట

అంతా సిద్ధం చేసుకున్నాం



నేటి నుంచి సముద్రంలోకి వేటకు బయలు దేరుతున్నాం. రెండు రోజుల నుంచే వేట సామగ్రిని సిద్ధం చేసుకోవడం జరిగింది. అధిక మత్స్య సంపదతో తిరిగి రావాలని తమ కుల దైవాన్ని ప్రార్థించుకుని బయలు దేరుతాం.

–వెంకటేశ్వర్లు, మత్స్యకారుడు, తూపిలిపాళెం

గత ఏడాది పరిహారం ఇవ్వాలి



ఈ సారి సముద్రంలో మత్స్య సంపద పుష్కలంగా దొరకాలని, దొరికిన చేపలకు మంచి ధరలు రావాలని వేటకు వెళ్తున్నాం. రెండు రోజులుగా తమ ఇష్ట దైవం గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్నాం. ఈ సారి కూటమి ప్రభుత్వం రెండు విడతలుగా కలిపి రూ. 20 వేలే ఇచ్చారు. గత ఏడాది పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

–పోలయ్య, మత్స్యకారుడు, కొండూరుపాళెం

విలీనం వద్దు.. ఊరి బడే ముద్దు

- పాఠశాల వద్ద గ్రామస్తుల నిరసన



చేడిమాల ప్రధాన పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చిల్లకూరు: పాఠశాలల విలీనం పేరుతో రెండు ప్రాథమిక పాఠశాలలను 2 కి.మీ దూరంలోని మరో బడిలో విలీనం చేయడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులను 2 కి.మీ. దూరం ఎలా పంపాలని తల్లిదండ్రులు శనివారం చేడిమాల పాఠశాల వద్ద నిరసనకు దిగారు. వివరాలు ఇలా.. చిల్లకూరు మండలం చేడిమాల పంచాయతీలో మూడు ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అందులో ఒకటి ప్రధాన పాఠశాల, మరొకటి, గిరిజన కాలనీలోని పాఠశాల మూడోది 2 కి.మీ దూరంలోని హ్యాబిటేషన్ గ్రామమైన నల్లాయగారి పాళెంలోని పాఠశాల ఉంది. అయితే ప్రధాన పాఠశాలలో 20 మంది, గిరిజన కాలనీలోని పాఠశాలలో 16 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ రెండు పాఠశాలలోని 36 మంది పిల్లలు తోడు లేకుండా 2 కి.మీ దూరం ఉన్న నల్లాయగారి పాళెంకు ఎలా పంపాలని ప్రశ్నించారు. ఈ మార్గంలో నిత్యం వందల టిప్పర్లు, లారీలు, పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు వెళుతుంటాయని పిల్లలు ఎలా వెళ్లగలరో చెప్పాలని డిమాండ్ చేశారు. విలీనం అంటూ పాఠశాలలను ఎత్తి వేసే ఆలోచనను విరమించుకోవాలని తల్లిదండ్రులు కోరారు.

కండలేరులో 37.188 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 37.188 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,400, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఇతర నాయకులు

నాయుడుపేట టౌన్: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. శనివారం నెల్లూరు జిల్లా జైలులో ఉన్న వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నేతలపై కుట్రపూరితంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, నేతలు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



రమణయ్య మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎస్‌ఐ

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో కృష్ణపట్నం రమణయ్య (70) అనే వ్యక్తి అనా రోగ్యంతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ గోపి అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుని వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు స్పందించకపోవడంతో స్థానికుల సహకారంతో అంత్యక్రియలు చేయించారు. ఎస్ఐ గోపిని ప్రజలు అభినందించారు.

ఘనంగా పల్లకి సేవ

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గూడూరు ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి, శ్యామలమ్మ దాతృత్వంతో మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఈవో రవిక్రిష్ణ, కలవకొండ భక్త బృందం పర్యవేక్షించారు.



అన్నదానం చేస్తున్న కలవకొండ భక్త బృందం

భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన



రాపూరు-పెంచలకోనలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయం వద్ద ఉన్న భక్తులు

రాపూరు: మండలంలోని పెంచలకోన శనివారం భక్తులతో కిక్కిరిసింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే ఐదో శనివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మిదేవి, ఆంజనేయ స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి 6 గంటలకు పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ చేపట్టారు.

రైలు కిందపడి వెండర్ మృతి

చిల్లకూరు: గూడూరు రైల్వే స్టేషన్‌లో శనివారం రైలు కింద పడి వెండర్ మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు గూడూరు పట్టణం రాణిపేటకు చెందిన చందు(37) రైల్వేలో వెండర్‌గా పని చేస్తున్నాడు. తిరుపతి నుంచి పూరి వెళుతున్న రైలులో ఆహార ప్యాకెట్లు విక్రయిస్తున్నాడు. రైలు కదలడంతో దిగేందుకు ప్రయత్నించాడు. కాలు జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గురువుల వాగ్వాదం

- సోషల్ మీడియాలో వైరల్

వెంకటగిరి రూరల్: పట్టణంలోని గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడికి, వైస్ ప్రిన్సిపల్‌కు విభేదాలు తలెత్తాయి. అవి శనివారం పాఠశాల బయట ఇద్దరూ దాడి చేసుకునే స్థాయికి చేరాయి. గమనించిన స్థానికులు సర్దుబాటు చేయడంతో వివాదం సద్దుమణిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి చక్రస్నానం

చిల్లకూరు: గూడూరు పట్టణం రాజావీధిలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాగంగా శనివారం చక్ర స్నానాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయంలోని కొలను వద్దకు తీసుకుని వచ్చి చక్ర స్నానం చేయించారు. తదుపరి వసంతోత్సవం చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ రవిక్రిష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీకంఠి రామోహన్‌రావు పర్యవేక్షించారు.



చక్రస్నానం చేయిస్తున్న ఆలయ అర్చకులు


అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి

చిల్లకూరు: అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. గూడూరులోని సీఐటీయూ కార్యాలయంలో ద్వితీయ మహాసభలు జరుగుతున్నాయి. ఇందులోభాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అంగన్‌వాడీలకు జీతాలు పెంచుతామని కూటమి నేతలు హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఆ విషయం గురించి పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో ఈ నెల 16న తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న దేశ వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పుట్టా శంకరయ్య, అధ్యక్షుడిగా పామంజి మణి, ప్రధాన కార్యదర్శిగా బీవీ రమణయ్య, దారా కోటేశ్వరరావు, జోగి శివకుమార్, అంగన్‌వాడీల జిల్లా అధ్యక్షులు పద్మలీల, వాణీశ్రీ, రాజేశ్వరమ్మ, ఇంద్రావతి, ప్రభావతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వాకాడు: మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో శనివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శంకుస్థాపన చేశారు. మత్స్యకారులకు ఉపయోగపడేందుకు రూ.2 కోట్లతో మల్టీ పర్పస్ బిల్డింగ్‌తోపాటు తీరంలో రోడ్లు, చేపలు ఎండబెట్టుకునే ప్లాట్ ఫామ్, తదితర అభివృద్ధి పనులు చేస్తున్నారు. అలాగే వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.


బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

కలువాయి(సైదాపురం): బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని బీవీఎస్ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల టీచర్ పెంచల పుల్లయ్య సూచించారు. కలువాయి మండలం బ్రాహ్మణపల్లి, రాజుపాళెం, మాదన్నగారిపల్లి, వెంకటరామరాజుపేట, ఉయ్యాలపల్లి, వెర్రిబెల్లి, చింతలపాళెం, రామన్నగారిపల్లి, సీతారంపల్లి గ్రామాల్లో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చక్కటి విద్యతోపాటు, ఉచితంగా బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాం అందజేస్తామని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



వెంకటగిరిలో యోగాసనాలు వేస్తున్న సీఐ ఏవీ రమణ తదితరులు

వెంకటగిరి రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. యోగాంధ్రలో భాగంగా శనివారం వెంకటగిరి పట్టణం క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానికులకు యోగాపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యల్లో భాగం చేసుకోవాలని సూచించారు. సీఐ ఏవీ రమణ, పుల్లుకొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు పాల్గొన్నారు.

బాలాయపల్లిలో..

బాలాయపల్లి(సైదాపురం): ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని శనివారం బాలాయపల్లిలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాసనాలు వేయించారు. ఎంపీడీవో కె.శ్రీనివాసులు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: ఆరోగ్యకరమైన జీవనానికి యోగా ఎంతో అవసరమని ఎంపీడీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. యోగాంధ్రలో భాగంగా శనివారం ఓజిలి ఉన్నత పాఠశాలలో యోగాపై అవగాహన కల్పించారు. అలాగే మండలంలోని పది సచివాలయాల పరిధిలోని ప్రజలకు యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్‌నాయుడు, శ్రీనివాసులురెడ్డి, వెంకటసుబ్బయ్య, రఫీ, కోటి పాల్గొన్నారు.

గూడూరులో..

చిల్లకూరు: మానసిక ఒత్తిడి నుంచి తగ్గించుకునేందుకు యోగా జీవితంలో భాగం కావాలని యోగా శిక్షకులు తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చిట్టమూరులో..

చిట్టమూరు: ప్రజలు జీవితంలో యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి దూరమవుతుందని ఎంపీడీవో మనోహర్ గౌడ్ తెలిపారు. మండలంలో శనివారం యోగాంధ్రపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మైగ్రేన్ తలనొప్పి, కీళ్ల నొప్పులు, మనోవేదన దూరమవుతాయని తెలిపారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మున్సిపాలిటీ, రూరల్ మండలంలో శనివారం మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఎంపీడీవో సురేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం యోగాంధ్రపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మండలంలో 114 ప్రాంతాలు, పట్టణంలో 15కు పైగా యోగా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

సైదాపురంలో..

సైదాపురం: మనిషి దినచర్యల్లో యోగా భాగం కావాలని యోగా శిక్షకులు కంచి ఆనంద్‌రెడ్డి తెలిపారు. సైదాపురంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. శారీరక ధృఢ సంకల్పంతోపాటు ఆరోగ్యకరంగా ఉండేందుకు యోగా దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఏవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

డక్కిలిలో..

డక్కిలి ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్ గురుకుల పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అధికారులు యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

కలువాయిలో..

కలువాయిలోని సచివాలయం 1, 2 వద్ద శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రోజూ సుమారు 20 నిమిషాలు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అధికారులు తెలిపారు.